సాక్షి పార్వతీపురం మన్యం

I

బుధవారం । 23 । ఆగస్టు । 2023

న్యూస్‌రీల్‌

శంబర పోలమాంబ దర్శన టికెట్ల ధరల పెంపు

మక్కువ: మండలంలోని శంబర గ్రామంలో వేంచేసిన పోలమాంబ అమ్మవారి ఆలయ దర్శన టికెట్ల ధరలు ఈ నెల 20 నుంచి పెంచినట్టు ఆలయ ఈఓ రాధాకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు కొనసాగుతున్న ప్రత్యేక దర్శనం టికెట్ ధర రూ.10 నుంచి రూ. 20కు, శీఘ్ర దర్శనం టికెట్ ధర రూ.50 నుంచి రూ.100కు పెంచినట్టు పేర్కొన్నారు. భక్తులందరూ గమనించి ఆలయ సిబ్బందికి సహకరించాలని కోరారు.

12 పాసింజర్ రైళ్లు రద్దు

విజయనగరం టౌన్: ఈస్ట్‌కోస్ట్ రైల్వే డివిజన్ పరిధిలోని అలమండ కోరుకొండ, విజయనగరం రైల్వేస్టేషన్‌ల మధ్య నాన్ ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఇరువైపులా వెళ్లే 12 రైళ్లను ఈ నెల 24, 25 తేదీల్లో రద్దుచేస్తామని ఈస్ట్‌కోస్ట్ రైల్వే సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖ–కోరాపుట్ (08546), కోరాపుట్–విశాఖ (08545), విశాఖ–రాయపూర్(08528), రాయపూర్–విశాఖ (08527), విశాఖ–పలాస(08532), పలాస–విశాఖ(08531), విశాఖ–రాయగడ (08504), రాయగడ–విశాఖ(08503) విశాఖ–విజయనగరం(07468) మెమూ స్పెషల్, విజయనగరం–విశాఖ (07469) మెమూ స్పెషల్, విశాఖ–పలాస (07470) మెమూ స్పెషల్, పలాస– విశాఖ(07471) మెమూ స్పెషల్ రైళ్లు రద్దుచేసినట్టు ప్రకటన విడుదల చేశారు.

రోడ్డుపై కూలిన మామిడిచెట్టు కొమ్మ



మండ గ్రామ సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డుపై కూలిన మామిడి చెట్టు కొమ్మ

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం నుంచి పార్వతీపురం వెళ్లే ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డులో మండ గ్రామ సమీపంలో భారీ మామిడి చెట్టు కొమ్మ మంగళవారం ఉదయం విరిగి పడింది. ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. రోడ్డుపై రెండు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్అండ్‌బీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని చెట్టుకొమ్మను తొలగించి రాకపోకలను క్రమబద్ధీకరించారు.



జయహో చంద్రయాన్-3

చంద్రయాన్-3లో భాగంగా చంద్రుని ఉపరితలంపైకి ఇటీవల ఇస్రోశాస్త్రవేత్తలు పంపించిన విక్రంరోవర్ సురక్షితంగా చేరుకోవాలని కోరుతూ వీరఘట్టం మండలం తలవరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు మంగళవారం చంద్రయాన్-3 అక్షర ఆకారంలో తమ ఆకాంక్షను తెలియజేశారు. అంతకు ముందు హెచ్‌ఎం ఉప్పాడ అప్పారావు ఆధ్వర్యంలో గ్రామంలో ఉపాధ్యాయులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఇస్రో శాస్త్రవేత్తలకు ఆల్ ద బెస్ట్ చెప్పారు.

– వీరఘట్టం

డీఈడ్ మొదటి సెమిస్టర్ పరీక్షల

షెడ్యూల్ విడుదల

- ఈ నెల 30వ తేదీలోగా ఫీజు చెల్లించాలి
- వచ్చేనెల 19 నుంచి 25వ తేదీ వరకు పరీక్షలు
- డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి

విజయనగరం అర్బన్: ఉపాధ్యాయ విద్య కోర్సుల (డీఎడ్) మొదటి సంవత్సర సెమిస్టర్ పరీక్షల షెడ్యూల విడుదల చేసినట్టు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022–24 బ్యాచ్ విద్యార్థులు, గత సెమిస్టర్‌లో పరీక్ష తప్పిన విద్యార్థులు అపరాధ రుసుము లేకుండా పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈ నెల 30 ఆఖరుతేదీగా పేర్కొన్నారు. అపరాధ రుసుం రూ.50తో వచ్చేనెల 6, 7వ తేదీలోగా చెల్లించవచ్చన్నారు. షెడ్యూల్ ప్రకారం ఒక సబ్జెక్టు పరీక్షకు హాజరయ్యేవారు రూ.100, రెండు సబ్జెక్టులకు రూ.120, మూడు సబ్జెక్టులకు రూ.140, నాలుగు నుంచి ఆరు సబ్జెక్టులకు రూ.150 చొప్పున ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. వచ్చేనెల 19 నుంచి 25వ తేదీవరకు సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయన్నారు. పూర్తి వివరాల కోసం 'బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఐఎన్' వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

సచివాలయాల్లో ఆధార్ సేవలు



పార్వతీపురం పట్టణ పరిధి జగన్నాథపురంలో ఆధార్‌ను అప్‌డేట్ చేస్తున్న సచివాలయ సంబ్బంది

- వేలిముద్రలు, ఫోన్‌నంబర్ల అనుసంధానం, అభ్యర్థుల చిరునామా మార్పులు, తదితర సేవలు
- జిల్లాలోని 15 మండలాల్లో ఆధార్‌అప్‌డేట్ చేయించని వారి సంఖ్య: 3,15,790
- వీరికోసం జిల్లాలోని 69 సచివాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు

పార్వతీపురంటౌన్: ఆధార్‌కార్డు... ప్రతి ఒక్కరికీ అత్యవసరమైనది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలన్నా, బ్యాంకు ఖాతా తెరవాలన్నా, లావాదేవీలు జరపాలన్నా, పాస్‌పోర్టు పొందాలన్నా.. ఇలా ప్రతిచోటా ఆధార్ అవసరం. ఆధార్ వచ్చిన కొత్తలో డాక్యుమెంట్లు తీసుకోకుండా యూనిక్ ఐడీ ఇచ్చేశారు. ఇప్పుడు అన్నింటికీ ఆధార్ అనుసంధానిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆధార్‌ను తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. డాక్యుమెంట్ అప్డేట్ చేసుకోని వారందరి ఆధార్‌కార్డులను ఈ ఏడాది సెప్టెంబర్ తర్వాత నిలిపివేస్తామని స్పష్టం చేసింది.

జిల్లాలో ప్రత్యేక ఆధార్ శిబిరాలు

ఆధార్ అప్‌డేషన్‌కు సంబంధించి ప్రభుత్వం సచివాలయాల్లోనే కేంద్రాలను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 69 సచివాలయాల్లో ఆధార్ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. నామమాత్రపు రుసుంతో ఆధార్ అప్డేట్ చేసుకోవచ్చు. దీనికోసం మంగళవారం నుంచి ఈ నెల 25 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో 3,15,790 మంది తమ ఆధార్‌కార్డులో వివరాలను అప్డేట్ చేసుకోవాల్సి ఉంది. అప్డేట్ ప్రక్రియను ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి జిల్లా అధికారులకు ఉత్తర్వులు అందాయి.

జిల్లాలో ఆధార్ నమోదు వివరాలు ఇలా..	
మండలాలు	15
సచివాలయాలు	350
ఆధార్ నమోదుకేంద్రాలు	69
శిబిరాలు నిర్వహించే తేదీలు	ఈనెల 22, 23, 24, 25
అప్డేట్ చేసుకోవాల్సిన వారి సంఖ్య	3,15,790

ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి..



ఆధార్ కార్డులోని వివరాలను తప్పనిసరిగా అప్‌డేట్ చేయించుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆధార్ అప్డేట్ చేసుకోకపోతే సస్పెండ్ అవుతుంది. అదే జరిగితే చాలా ఇబ్బందిపడాల్సి వస్తుంది. ప్రభుత్వ పథకాలు అందవు. బ్యాంకింగ్, తదితర సర్వీసులు నిలిచిపోతాయి. ప్రతిఒక్కరూ నిర్దేశిత గడువులోగా ఆధార్ కార్డులను అప్డేట్ చేసుకోవాలి. అప్‌డేషన్ కోసం ఈ నెల 22, 23, 24, 25 తేదీల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నాం. ఈ ప్రక్రియను ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షిస్తారు.

– కె.రామచంద్రరావు, గ్రామ వార్డు సచివాలయాల జిల్లా అధికారి, పార్వతీపురం మన్యం

అప్డేట్ ఎందుకు చేసుకోవాలంటే..

- కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆధార్ కలిగి ఉన్న ప్రతిఒక్కరూ తమ ఆధార్ వివరాలను అప్డేట్ చేసుకోవాలి.
- 2010 నుంచి 2016వ సంవత్సరం వరకు ఆధార్ మంజూరు చేసేటప్పుడు ఎలాంటి డాక్యుమెంట్లూ తీసుకోలేదు. ఈ క్రమంలో బోగస్ ఆధార్ కార్డులు పెరిగి పోయాయి. వీటిని ఏరివేసే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. ఆధార్ కార్డు ఉన్న పౌరులు తమ పేరు, చిరునామా, సరైన ఆధారాలతో ధ్రువీకరించుకోవాలి.
- జిల్లా పునర్విభజనలో భాగంలో నూతన జిల్లా పేరుతో కొత్త చిరునామాతో కొత్త కార్డును అందజేస్తారు.
- 2010 నుంచి 2016 మధ్య ఆధార్ తీసుకుని 2016 తర్వాత ఆధార్ పేరు, చిరునామా మార్చుకోని వారు తప్పనిసరిగా తమ డాక్యుమెంట్ అప్డేట్‌చేసుకోవాలి.
- 2016 తర్వాత ఫొటో, జనన తేదీని మార్చుకున్నప్పటికీ.. చిరునామా మార్చుకోని వారు డాక్యుమెంట్ అప్డేట్ చేసుకోవాల్సిందే. లేదంటే ఆధార్‌కార్డు ఉన్నా సెప్టెంబర్ తరువాత పనిచేయదు.
- ఆధార్ సస్పెండ్ అయితే ఆధార్తో లింక్ అయిన మొత్తం అన్ని సేవలూ నిలిచిపోతాయి. బ్యాంకింగ్, పోస్టల్, గ్యాస్ తదితర సర్వీసులు ఆగిపోతాయి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి అందుతున్న సంక్షేమ పథకాల లబ్ధి కూడా ఆగిపోతుంది.
- ఆధార్ కార్డులో ఉన్న చిరునామా, ప్రస్తుత చిరునామా వేరుగా ఉంటే సరైన ఆధారాలతో చిరునామా అప్‌డేట్ చేయించుకోవాలి.
- వివాహానికి ముందు ఆధార్‌లో మహిళలకు పుట్టింటివారి ఇంటిపేరు ఉంటుంది. వివాహం తర్వాత భర్త ఇంటి పేరుతో ఆధార్ తీసుకోవాలంటే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం మంజూరు చేసిన మ్యారేజ్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుంది.

జిల్లాలో ఆధార్ అప్డేట్‌కు కేటాయించిన కేంద్రాలు ఇవే...	
బలిజిపేట	అరసాడ, బలిజిపేట, వంతరాం, గంగాడ
భామిని:	బత్తిలి–2, భామిని, గనసర
సాలూరు అర్బన్	దేవరవీధి, గంధీనగర్–2, రామాకాలనీ
సాలూరు రూరల్	కురుకుట్టి, మామిడిపల్లి, పెదపదం, తోణాం
పాలకొండ రూరల్	అంపిలి,ఎల్ఎల్‌పురం, ఎం సింగిపురం, బెజ్జి
పాలకొండ అర్బన్	నీలమ్మకాలనీ, రామాకళామందిర్ వీధి (కోమటిపేట)
గరుగుబిల్లి	రావివలస, ఉల్లిభద్ర, గరుగుబిల్లి
మక్కువ	మార్కొండపుట్టి, మక్కువ–1, శంబర
గుమ్మలక్ష్మీపురం	ఇరిడి, కొండవాడ, కేదారిపురం, ఖాలేసు, గుమ్మలక్ష్మీపురం
జియ్యమ్మవలస	అలమండ, బీజే పురం, జీటీవాడ, గవరంపేట, చినమేరంగి
కొమరాడ	గంగిరేగువలస, మాదలంగి, పెదశాక, విక్రాంపురం
కురుపాం	గుమ్మ, మొండింఖల్లు, పెద్దగొత్తిలి, రస్తాకుంటుబాయి
పాచిపెంట	పనుకువలస, పద్మాపురం, పాంచాలి
సీతంపేట	కుడ్డపల్లి, దారపాడు, గొయిది, కిల్లాడ, సీతంపేట–1
సీతానగరం	జోగింపేట, అంటిపేట, బూర్జ, ధయానిధిపురం
వీరఘట్టం	కత్తులకవిటి, పనసనందివాడ, వండవ, వీరఘట్టం–1, 3
పార్వతీపురం అర్బన్	జగన్నాథపురం–1, కొత్తబెలగాం–1, మేధరవీధి–1
పార్వతీపురం రూరల్	డోకిశీల, ములగ, పెదమరికి, జమదాల

ముఖ్యమంత్రి పర్యటనకు

చురుగ్గా ఏర్పాట్లు



సీఎం పర్యటన ఏర్పాట్లపై చర్చిస్తున్న తలశిల రఘురాం, ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు

- ఈ నెల 25న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం శంకుస్థాపనకు రాక
- ఘనంగా స్వాగతం పలికేందుకు సన్నాహాలు
- మరడాం వద్ద బహిరంగ సభకు వేదిక నిర్మాణం
- కార్యక్రమం విజయవంతానికి డిప్యూటీ సీఎం రాజన్నదొర పిలుపు
- ఏర్పాట్లను పరిశీలించిన సీఎం ప్రోగ్రామ్స్ కన్వీనర్ తలశిల, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం భవనాల నిర్మాణానికి సాలూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని మెంటాడ మండలం చినమేడపల్లి వద్ద శంకుస్థాపనకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమం నిమిత్తం ఈనెల 25న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ముఖ్య అతిథులుగా రానున్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ సీఎం, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు. ఈ ఏర్పాట్లను మంగళవారం సీఎం ప్రోగ్రామ్స్ కన్వీనర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో కలిసి ఆయన పరిశీలించారు. ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి పర్యటన ఏర్పాట్లను విజయనగరం కలెక్టర్ నాగలక్ష్మి నేతృత్వంలో జిల్లా యంత్రాంగం ముమ్మరంగా నిర్వహిస్తోంది. మెంటాడ మండలం చినమేడపల్లిలో శంకుస్థాపన కార్యక్రమానికి వీలుగా ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో రెండుపొక్లెయిన్లతో పొదలను తొలగించి నేలను చదును చేశారు. మరోవైపు జాతీయ రహదారి నుంచి కుంటినవలస మీదుగా చినమేడపల్లి వరకు 4 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులను చేపట్టారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు పర్యవేక్షణలో చురుగ్గా సాగుతున్నాయి. ఈ నాలుగు కిలోమీటర్ల మార్గంలో ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి ప్రయాణించనున్నారు. వారిని చూసేందుకు ప్రజలు భారీ సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున పలుచోట్ల బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యమంత్రి విశాఖపట్నం నుంచి హెలికాప్టర్‌లో చేరుకోనున్నారు. హెలీప్యాడ్ నుంచి కుంటినవలస వరకు రోడ్డు మార్గంలో ప్రయాణిస్తారు. ఈ దృష్ట్యా భద్రతా ఏర్పాట్లపై కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపిక, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ చర్చించారు.

బహిరంగ సభకు ఏర్పాట్లు...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలో భాగంగా గజపతినగరం నియోజకవర్గం పరిధి దత్తిరాజేరు మండలంలోని మరడాం వద్ద బహిరంగ సభలో పాల్గొంటారు. ఈ సభకు విజయనగరం జిల్లాలోని దత్తిరాజేరు, మెంటాడ, గజపతినగరం, బాడంగి, రామభద్రపురం మండలాలతో పాటు పొరుగున పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు, పాచిపెంట మండలాల నుంచి ప్రజానీకం హాజరయ్యేందుకు వీలుగా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. విజయనగరం జిల్లా నుంచి 200 ఆర్టీసీ బస్సులు, మరో 150 ప్రైవేట్ వాహనాలను సమకూరుస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో వంద బస్సులను ఏర్పాటు చేస్తున్నారు.



మరడాం వద్ద బహిరంగ సభకు ఏర్పాట్లు

నాలుగుచోట్ల పార్కింగ్....

మరడాంలో జరిగే బహిరంగ సభకు హాజరయ్యే ప్రజానీకం, ప్రముఖుల వాహనాల కోసం నాలుగు చోట్ల పార్కింగ్ ఏర్పాట్లను పోలీస్ యంత్రాంగం చేస్తోంది. మరడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బస్సులు, గ్రామ సచివాలయం రోడ్డులో కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల పార్కింగ్ కోసం స్థలాలను గుర్తించారు. గజపతినగరం, దత్తిరాజేరు ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు, కార్ల పార్కింగ్ కోసం వేదిక సమీపంలోని తాడెన్నదొరవలస రోడ్డులో పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నారు. సీఎం సభకు హాజరయ్యే ప్రముఖుల వాహనాలు పార్కింగ్ కోసం హెలిపాడ్ వద్ద స్థలాన్ని గుర్తించి ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏర్పాట్ల పరిశీలన...

జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భారీ ఎత్తున చేస్తున్న ఏర్పాట్లను సీఎం కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురాం, ఉపముఖ్యమంత్రి పి.రాజన్నదొర, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు బొత్స అప్పలనర్సయ్య, శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పరిశీలించారు. సీఎం సభావేదిక ఏర్పాట్లను, హెలీప్యాడ్, శంకుస్థాపన శిలాఫలకం వద్ద ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. కార్యక్రమానికి తరలివచ్చే ప్రజలకు ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలగని రీతిలో ఏర్పాట్లు చేయాలని అధికారులకు తలశిల రఘురాం సూచించారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయండి...

ఈ ప్రాంతంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటవుతున్న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రానున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలి. గిరిజనులకు ఉన్నత విద్యావకాశాలను కల్పించే ఈ విద్యా సంస్థ శంకుస్థాపన కార్యక్రమంలో మా సాలూరు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున గిరిజనులు పాల్గొనేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. తమ సంప్రదాయ నృత్యాలతో సీఎం, కేంద్ర మంత్రికి ఘనంగా స్వాగతం పలకనున్నారు.

– పీడిక రాజన్నదొర, ఉపముఖ్యమంత్రి

నాణ్యతతో నాడు-నేడు పనులు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురం: జిల్లాలో నాడు–నేడు నిధులతో చేపట్టిన పీహెచ్‌సీల అభివృద్ధి పనులు నాణ్యతగా చేయాలని, లేదంటే కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని రోడ్లు, భవనాల శాఖాధికారులను కలెక్టర్ నిషాంత్ కుమార్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశమందిరంలో వైద్యాధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ఆస్పత్రుల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని చెప్పారు. వైద్యులు నిబద్ధతతో పనిచేసి ప్రజలకు ప్రభుత్వాస్పత్రులపై నమ్మకం కలిగేలా పనిచేయాలన్నారు. ప్రసవ మరణాలు సంభవిస్తే ఉపేక్షించేది లేదన్నారు. మలేరియా, డెంగీ జ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఐడీల కేటాయింపును రెండువారాల్లో పూర్తిచేయాలని సూచించారు. పీహెచ్‌సీల్లో సేవాలోపాలకు సంబంధిత మెడికల్ అధికారులే బాధ్యత వహించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బంది పేర్లు తెలియజేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డి. భాస్కరరావు, సూపరింటెండెంట్ వాగ్దేవి, డీఐఓ టి.జగన్‌మోహన్‌రావు, పీహెచ్‌సీ వైద్యాధికారులు పాల్గొన్నారు.

స్మార్ట్‌గా విద్యాబోధన

- తరగతి గదుల్లో ఐఎఫ్‌పీల ఏర్పాటు
- పార్వతీపురం మన్యం జిల్లాకు 770 ఐఎఫ్‌పీ ప్యానల్స్ కేటాయింపు
- తొలివిడతలో 498 పాఠశాలల్లో అమరిక
- స్మార్ట్ ఫోన్లు, టెలిప్యాడ్‌లతో సులభతరమైన బోధన, అభ్యసన



భామిని ఏపీ మోడల్ స్కూల్‌లో డిజిటల్ తరగతుల నిర్వహణ ఇలా..

భామిని: సర్కారుబడిలో విద్యాబోధన ఆధునిక పద్ధతుల్లో సాగుతోంది. నాడు–నేడు పనులతో సుందరంగా ముస్తాబైన పాఠశాలల్లో 'స్మార్ట్'గా చదువులు సాగుతున్నాయి. బ్లాక్‌బోర్డుల స్థానంలో ఐఎఫ్‌పీ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్) ఏర్పాటయ్యాయి. విద్యార్థులకు డిజిటల్ బోధన చేరువైంది. తెరపై కనిపించే బొమ్మలతో బోధన అర్థవంతంగా సాగుతోంది. కార్పొరేట్‌ను తలదన్నేలా పేదకుటుంబాల పిల్లలకు ప్రమాణాలతో కూడిన విద్య అందుతోంది. భవిష్యత్తుకు బంగారుబాటలు వేసే బృహత్‌క్రతువును జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు నిరాటంకంగా సాగిస్తోంది. విద్యార్థుల చదువులే రాష్ట్రానికి పెట్టుబడిగా విద్యారంగానికి రూ.కోట్లు ఖర్చు చేస్తోంది.

జిల్లాలో డిజిటల్ బోధన ఇలా..

పార్వతీపురం మన్యం జిల్లాలోని 770 స్కూల్స్‌లో స్మార్ట్ తరగతులు నిర్వహించాలన్నది విద్యాశాఖ అధికారుల లక్ష్యం. మొదటి విడతగా 498 స్మార్ట్ తరగతి గదులను సిద్ధం చేశారు. వాటిలో ఐఎఫ్‌పీలను ఏర్పాటుచేశారు. 3, 4, 5 తరగతుల చిన్నారులకు స్మార్ట్ టీవీల ద్వారా, ఆరు నుంచి 10 తరగతి విద్యార్థులకు ఐఎఫ్‌పీల ద్వారా ఆధునిక విధానంలో పాఠ్యాంశాలను బోధిస్తున్నారు.

ఉపయోగం ఇలా..

డిజిటల్ బోధన దృశ్య, శ్రవణ విధానంలో సాగుతుంది. దీనివల్ల విద్యార్థుల్లో నేర్చుకోవాలన్న తపన కలుగుతుంది. కళ్లముందు ప్రత్యక్షమయ్యే వీడియోలు, చిత్రాలతో పాఠ్యాంశం సులభంగా అర్థమవుతుంది. ఐఎఫ్‌పీలు బ్లాక్ బోర్డులా కూడా ఉపయోగపడతాయి. దానిపై రాసిన దానిని చెరపవచ్చు. మరళా రాయవచ్చు. రాసిన దానిని స్క్రీన్‌పై సేవ్ చేయవచ్చు. ఇంటర్నెట్ సహాయంతో కంప్యూటర్‌గా ఉపయోగించవచ్చు. యూట్యూబ్ లేదా ఫోన్, ట్యాబ్స్‌లోని మేటర్‌ను స్క్రీన్‌పై చూపించవచ్చు.

టీచర్లకు ప్రత్యేక శిక్షణ



ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్(ఐఎఫ్‌పీ) వినియోగంపై ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు నిపుణులతో ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. రాజాం, గరివిడి, విజయనగరం జేఎన్‌టీయూ అనుబంధ కాలేజీల సాంకేతిక నిపుణులు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాం. అంచెలంచెలుగా జిల్లాలోని అన్ని స్కూల్స్‌లోనూ ఏర్పాటు చేస్తాం.

– ఎస్.ప్రేమ్‌కుమార్, డీఈఓ, పార్వతీపురం మన్యం జిల్లా

క్లుప్తంగా

పాడిపశువులపై కుక్కల దాడి



కుక్కల దాడిలో తోక కోల్పోయిన పశువును చూపిస్తున్న రైతు

వంగర: మండల పరిధి ఎం.సీతారాంపురం గ్రామంలో పాడిపశువులపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. మంగళవారం జరిగిన ఈ ఘటనలో గ్రామానికి చెందిన బలగ జయరాం, ముదిలి పైడిరాజు, ఒమ్మి నాగమ్మ, దుప్పాడ సింహాచలానికి చెందిన పాడిపశువులు గాయపడడంతో ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం మేరకు స్థానిక వెటర్నరీ అసిస్టెంట్ బౌరోతు పృథ్వీ పశువులకు చికిత్స అందించారు. కుక్కలను నివారించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

వివాహితుడిపై పోక్సో కేసు నమోదు

చీపురుపల్లి రూరల్: మండలంలోని కరకాం పంచాయతీ పరిధి సంకుపాలెం గ్రామానికి చెందిన వివాహితుడు శనపతి ప్రసాద్‌పై అదే గ్రామానికి చెందిన యువతి ఫిర్యాదు మేరకు పోక్సోకేసు నమోదు చేశామని ఎస్సై సన్యాసి నాయుడు తెలిపారు. ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన యువతి చీపురుపల్లి కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుకుంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన శనపతి ప్రసాద్ ఆ యువతితో పరిచయం పెంచుకుని ఫోన్‌చేస్తూ నువ్వంటే ఇష్టమని, ప్రేమిస్తున్నానని, మాయమాటలు చెప్పి శారీరక సంబంధం పెట్టుకుని గర్భవతిని చేశాడు. నీరసంగా ఉన్న కుమార్తెను తల్లిదండ్రులు విజయనగరం ఘోషాఆస్పత్రికి తీసుకువెళ్లగా రక్తం తక్కువగా ఉందని, గర్భం దాల్చినట్లు వైద్యసిబ్బంది తెలపడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఎస్సై సన్యాసినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

- భీమిలి బీచ్‌లో మృతదేహం లభ్యం ..

విజయనగరం క్రైమ్: ఇంట్లోంచి వెళ్లిపోయిన వ్యక్తి భీమిలి సముద్రంలో ఆత్మహత్య చేసుకున్నట్లు విజయనగరం వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం సీఐ బి.వెంకటరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక బ్యాంక్ కాలనీకి చెందిన దేవర కొండ మహావీర్ (30) ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు. సోమవారం పని మానేసి ఇంటికి వచ్చేయడంతో కుటుంబసభ్యులతో వాగ్వాదం జరిగింది. అనంతరం మహావీర్ ఇంట్లోంచి వెళ్లిపోయాడు. రాత్రి 8 గంటల తర్వాత ఫోన్ స్విచాఫ్ వచ్చింది. మంగళవారం మధ్యాహ్నం భీమిలి బీచ్‌లో మృతదేహం లభ్యమైంది. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవమానంతో గిరిజనుడు..

సీతంపేట: చిల్లంగి నెపంతో అనుమానించి దాడి చేసిన సంఘటనలో అవమానం భరించలేక బెత్తుపురం గ్రామానికి చెందిన గిరిజనుడు సవర కిచ్చాయి(44) ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ సంఘటనపై పోలీసులు మంగళవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో కొంతమందికి చిల్లంగి పెడుతున్నాడని అనుమానించి అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కిచ్చాయిని సోమవారం గ్రామంలో స్తంభానికి కట్టేసి కొట్టారు.ఈ అవమానం భరించలేక ఇంటికి వెళ్లిన తరువాత కిచ్చాయి ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఊరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.మృతుని భార్య లక్కమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నీలకంఠ రావు తెలిపారు. మృతుడికి భార్య,ముగ్గురు పిల్లలున్నారు.

11 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

విజయనగరం క్రైమ్: పట్టణంలోని కూరాకుల వీధి, బృందావనం అపార్ట్‌మెంట్ సమీపంలో పేకాట ఆడుతున్న 11 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారి నుంచి రూ. 8వేల నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై షేక్ శంకర్ మంగళవారం తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380–00
బంగారం(22సి. 10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹116	₹202	₹ 212

సీతాఫలం.. ఆరోగ్య బలం

- పెరగనున్న రోగ నిరోధక శక్తి
- ప్రయోజనాలు అనేకం



ఏజెన్సీలో లభ్యమవుతున్న సీతాఫలం



పండ్లను విక్రయిస్తున్న గిరిజనులు

గుమ్మలక్ష్మీపురం: ఏజెన్సీలో సీతాఫలాల సీజన్ ప్రారంభమైంది. తియ్యని ఈ పండ్లలో ఎన్నో పోషక విలువలుండడమే కాకుండా కొన్ని రకాల అనారోగ్యాల నివారిణిగా పనిచేస్తుంది. ఈ పండే కాకుండా చెట్టు ఆకులు, బెరడు కూడా ఔషధ గుణాలను కలిగి ఉన్నాయని రస్తా కుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం (ఆచార్యా ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం) గృహ విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త వై.ఉమాజ్యోతి తెలిపారు. సీతాఫలం తీసుకుంటే కలిగే ఉపయోగాల గురించి ఆమె తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

ఎన్నో విటమిన్ల కలబోత

సీతాఫలంలో ఎన్నో రకాల పోషకాలతో పాటు విటమిన్లు ఉన్నాయి. ఈ పండు తింటే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. విటమిన్ (ఎ), విటమిన్ (బి) మెగ్నీషియం, పొటాషియం, ఫైబర్, ఐరన్ వంటి ఎన్నో పోషకాలు ఉంటాయి. ఉదయాన్నే తినడం ద్వారా కండరాలు, నరాల బలహీనత వంటి రుగ్మతలు తొలగిపోతాయి. శరీరానికి కావాల్సినంత శక్తి లభిస్తుంది. విటమిన్ (ఎ) పుష్కలంగా ఉండడంతో కంటి సమస్యలు దూరమవుతాయి. మెగ్నీషియం, పొటాషియం, సోడియం సమపాళ్లలో ఉండడం వల్ల రక్తపోటును అదుపు చేసి గుండె సమస్యలు తలెత్తకుండా చూస్తుంది. పేరుకుపోయిన అధిక కొవ్వును కరిగిస్తుంది. అల్సర్, గ్యాస్, అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. గర్భిణులు తినడం ద్వారా పుట్టబోయే బిడ్డల మెదడు చురుగ్గా ఉంటుంది.

క్యాన్సర్ వంటి రోగాలు రాకుండా తోడ్పడుతుంది. బలహీనంగా ఉండే చిన్న పిల్లలకు సీతాఫలాలను ఎంత ఎక్కువగా తినిపిస్తే అంత మేలు. ఈ పండ్లను ఎక్కువగా తినడం ద్వారా రక్తహీనత తగ్గుతుంది. కడుపులో మంట, జీర్ణ సంబంధ సమస్యలున్న వారు ఈ పండ్లను ఎక్కువగా తినడం మంచిది. డైటింగ్ చేసేవారు ఈ పండ్లను క్రమం తప్పకుండా తీసుకుంటే మంచి ఫలితాలను పొందవచ్చు. ఎదుగుతున్న పిల్లలు నిత్యం తింటుంటే కాల్షియం లాంటి పోషకాలు అధికంగా లభిస్తాయి. దీంతో ఎముకలు దృఢంగా ఉంటాయి. శరీరంలో ఉన్న వ్యర్థ పదార్థాలను బయటకు పంపడంలో ఎంతగానో ఉపయోగపడుతుంది. రక్తం శుద్ధి అవుతుంది.

గుండె ఆరోగ్యానికి మెరుగు

సీతాఫలం చూడడానికి కూడా హృదయాకారంలో ఉంటుంది. శరీరమంతా రక్తప్రసరణ సరిగ్గా ఉండేలా చూస్తుంది. అందువల్ల రక్తహీనత దరి చేరదు. ఈ పండు తీసుకోవడం వల్ల హిమోగ్లోబిన్ లెవెల్స్ కూడా సరిగ్గా ఉంటాయి.

ఉదర ఆరోగ్యానికి..

దీనిలో విటమిన్ సి సమృద్ధిగా దొరుకుతుంది. ఆహారం తేలిగ్గా జీర్ణమయ్యేటందుకు దీనిలోని పీచుపదార్థం తోడ్పడుతుంది. అల్సర్లను నయం చేస్తుంది. ఎసిడిటీకి చెక్ పెడుతుంది. డయేరియా లాంటి సమస్య రాకుండా అడ్డుకుంటుంది.

చర్మ ఆరోగ్యానికి దోహదం

ఈ పండులో స్మూత్ స్కిన్ టోన్ అందించే సూక్ష్మపోషకాలు ఉంటాయి. దీన్ని తినడం వల్ల చర్మ ఆరోగ్యం మెరుగుపడి స్కిన్ మెరుస్తుంది.

ఆకులతోనూ ప్రయోజనం

ఒక్క పండేకాదు, సీతాఫలంచెట్టు ఆకులు కూడా ఉపయోగపడతాయి. ఆకుల్లోని హైడ్రోక్లోరిక్ ఆమ్లం చర్మ సంబంధ సమస్యల్ని తగ్గిస్తుంది. ఆకుల్ని మెత్తగా నూరి రాస్తే చర్మ వ్యాధులు తగ్గుతాయి. ఆకుల్ని మెత్తగా నూరి బోరిక్ పౌడర్ కలిపి మంచం, కుర్చీల మూలల్లో ఉంచితే నల్లుల బెడద ఉండదు. చెట్టు బెరడును కాచగా వచ్చిన కషాయాన్ని అధిక విరేచనాలతో బాధపడేవారికి ఔషధంగా ఇస్తుంటారు. సీతాఫలం గింజల్ని పొడిచేసి తలకు రాసుకుంటే పేల సమస్య ఉండదు. అయితే కళ్లల్లో పడకుండా చూసుకోవాలి.

నేరుగా తినడమే మంచిది



గర్భిణులు ఈ పండును సాధ్యమైనంత తక్కువగా తినాలి. పొరపాటున గింజలు లోపలికి వెళితే గర్భస్రావం అయ్యే ప్రమాదం ఉంది. మోతాదుకు మించి తినకూడదు. మధుమేహ వ్యాధి గ్రస్తులు, ఊబకాయులు ఈ పండ్లను వైద్యుల సలహాలతో తీసుకోవాలి. జలుబు, దగ్గు, ఆయాసం, ఎలర్జీ సమస్యలతో బాధపడేవారు పరిమితంగా తీసుకోవడం మంచిది. ఈ ఫలాన్ని రసం రూపంలో కాకుండా నేరుగా తినడమే ఉత్తమం. ఎందుకంటే గుజ్జు నోటిలోపల జీర్ణరసాలను పెంచుతుంది. తద్వారా జీర్ణక్రియ వేగవంతమవుతుంది. పండుగుజ్జును తీసుకుని రసంలా చేసి పాలు కలిపి పిల్లలకు తాగిస్తే సత్వర శక్తి లభిస్తుంది.

– వై.ఉమాజ్యోతి, శాస్త్రవేత్త, కేవీకే, రస్తాకుంటుబాయి

పైడితల్లికి పుష్ప సోయగం



ప్రత్యేక పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం వివిధ రకాల పుష్పాలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలాపాపారావులు శాస్త్రోక్తంగా అమ్మవారికి పూజలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి పర్యవేక్షించారు.

అలసత్వం వహిస్తే షోకాజ్ నోటీసులు

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: పనితీరు బాగాలేని, విధుల పట్ల అలసత్వం వహించే వైద్యసిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు స్పష్టం చేశారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో మంగళవారం పీహెచ్‌సీ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, దీన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత వైద్యాధికారులపై ఉందన్నారు. నిర్దేశించిన సమయంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్యశిబిరం వద్ద వైద్యులు అందుబాటులో ఉండాలని చెప్పారు. అలా కాకుండా విధులకు డుమ్మాకొడితే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఫ్యామిలీ డాక్టర్ శిబిరానికి వచ్చే రోగులకు సక్రమంగా వైద్య సేవలు అందేలా చూడాలని కోరారు. జిల్లాలో మాతాశిశు మరణాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, సుగర్, ఆస్తమా వంటి కలిగిన బాధితులను గుర్తించి చికిత్స అందించాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్. సూర్యనారాయణ, డీఐఓ డాక్టర్ అచ్యుతకుమారి, జిల్లా మలేరియా అధికారి వై.మణి తదితరులు పాల్గొన్నారు.

పేదల ఉన్నత చదువుకు ప్రభుత్వం భరోసా



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పక్కన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: పేదల ఉన్నత చదువులకు ప్రభుత్వం భరోసా కల్పిస్తూ విద్యలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తోందని ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావులు అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడుతో కలిసి రామభద్రపురం, బాడంగి మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర మాట్లాడుతూ మెంటాడ మండలం కుంటినవలస వద్ద ఈ నెల 25వ తేదీన జరగనున్న కేంద్రియ గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రానున్నందున పెద్దసంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ ప్రాంత పేద విద్యార్థులతో పాటు పొరుగు రాష్ట్రాల విద్యార్థులకు గిరిజన విశ్వవిద్యాలయం అందుబాటులోకి రానుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం ఏది చేసినా టీడీపీ నాయకులు సహించలేకపోతున్నారని విమర్శించారు. రాను రాను గల్లంతవుతున్న పార్టీ ఉనికిని నిలబెట్టేందుకు ప్రభుత్వంపైన లేనిపోని బురదజల్లుతున్నారని మండిపడ్డారు. ఈ జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు అడిగిన వెంటనే మంజూరు చేయడంతో పాటు శంకుస్థాపనకు వస్తున్న ముఖ్యమంత్రికి ఉత్తరాంధ్ర ప్రజలమంతా రుణపడి ఉంటామన్నారు.

సభకు తరలిరావాలి

ముఖ్యమంత్రి సమావేశానికి ప్రత్యేక బస్సుల సౌకర్యం కల్పిస్తున్నామని అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, రామభద్రపురం బాడంగి జెడ్పీటీసీలు అప్పికొండ సరస్వతి, పెద్దింటి రామారావు.బొబ్బిలి వైఎస్సార్‌సీపీ నాయకులు శంబంగి వేణుగోపాలనాయుడు, ఇంటి గోపాలరావు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలం నాయుడు, రామభద్రపురం, బాడంగి నాయకులు పాల్గొన్నారు.

గడువు పొడిగింపు

పార్వతీపురం: జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్ట్ 2024–25 విద్యాసంవత్సరానికి 6వ తరగతి సెషన్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఈనెల 25 వరకు గడువును పొడిగించినట్లు డీఈఓ ఎన్. ప్రేమ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఎన్‌వీఎస్ వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్://నవోదయ.జీఓవి.ఇన్ లేదా హెచ్‌టీటీపీఎస్://సిబిఎస్‌ఇఐటిఎంఎస్. ఆర్‌సిఇఎల్‌ఎల్.జీఓవి.ఇన్/ఎన్‌విఎస్/.లో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు..

గురుపూజోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయ అవార్డుల కోసం దరఖాస్తులకు గడువు పెంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న అర్హత కలిగిన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు నమూనాను సంబంధిత మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో పొందవచ్చునని తెలిపారు. ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయ సర్వీసు 15 సంవత్సరాలు కలిగి, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొంది, ఎటువంటి క్రమశిక్షణ చర్యలు లేని వారు అవార్డులకు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన ఉపాధ్యాయులు సంబంధిత మండల విద్యాశాఖాధికారి, ఉప విద్యాశాఖాధికారి వారి ద్వారా ఆగస్టు 24 తేదీ లోగా దరఖాస్తులు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని వివరించారు.

గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర సేవలు అందించాలి

పార్వతీపురం టౌన్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు పూర్తిస్థాయిలో అత్యవసర సేవలు అందించాలని 104 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ మురళీకృష్ణ అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా ఆస్పత్రి సమీపంలో ఉన్న 104 వాహనాలు. రికార్డులు, పరికరాలు, మందులను ఆయన తనిఖీ చేశారు. అత్యవసర వాహనాల్లో ఎటువంటి సాంకేతిక సమస్యలు ఉన్నా తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వాహనాల కండిషన్‌ను పరిశీలించి సమస్య ఉంటే తనకు తెలియజేయాలని చెప్పారు. 104 సిబ్బంది. దుర్గాప్రసాద్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

24న ఐటీఐలో జాబ్‌మేళా

రాజాం సిటీ: స్థానిక ఐటీఐలో ఈ నెల 24న జాబ్‌మేళా నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలివ్ టీవీఎస్ అండ్ మహీంద్ర కంపెనీల ఆధ్వర్యంలో జరగనున్న ఈ జాబ్‌మేళాకు మెకానిక్ డీజిల్ ట్రేడ్ పూర్తయిన అభ్యర్థులు అర్హులని అన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 9 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి ఆహ్వానం

స్థానిక ఐటిఐ కళాశాలలో మిగులు సీట్ల భర్తీకి మూడో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 27వరకు గడువు ఉందన్నారు. దరఖాస్తు దారులకు 28న సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌తోపాటు 30న కౌన్సెలింగ్ నిర్వహించనున్నామని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8309438446, 8328584366 నంబర్లను సంప్రదించాలని సూచించారు.



క్రీడా పురస్కారాలకు 5 పాఠశాలల ఎంపిక

పార్వతీపురంటౌన్: క్రీడా ప్రతిభా పురస్కారాలకు జిల్లా నుంచి ఐదు పాఠశాలలు ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పురస్కారాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. 2022–23 రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ ఆధారంగా సాలూరు మండలంలోని పురోహితునివలస ఏపీఎంఎస్ పాఠశాల, గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర జెడ్పీ ఉన్నత పాఠశాల, పార్వతీపురం మండలం నర్సిపురం జెడ్పీ ఉన్నత పాఠశాల, పాచిపెంట మండలం జెడ్పీ ఉన్నత పాఠశాల, కురుపాం మండలంలోని కొత్తగూడ జీటీడబ్ల్యూఏహెచ్‌ఎస్ ఎంపికయ్యాయని వివరించారు.

అమ్మవారి అన్నదానానికి టేబుల్స్ వితరణ



టేబుల్స్ వితరణ చేస్తున్న డాక్టర్ వీఎస్.ప్రసాద్

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి నిత్యాన్నదానానికి సంబంధించి భక్తుల సౌకర్యార్థం కూర్చునేందుకు ఆరు టేబుల్స్, ఆహార పదార్థాలు పెట్టుకునేందుకు రెండు పెద్ద టేబుల్స్ మొత్తం రూ.లక్షా 50 విలువైన వాటిని వైద్యనిపుణుడు డాక్టర్ వీఎస్.ప్రసాద్ మంగళవారం అందజేశారు. ఈ మేరకు స్థానిక అమ్మవారి కల్యాణ మంటపం ఆవరణలో మంగళవారం మధ్యాహ్నం ప్రత్యేక పూజలు నిర్వహించి ట్రస్టు బోర్డు సభ్యుల సమక్షంలో టేబుల్స్ వితరణ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు రమేష్ పట్నాయక్, ఏడుకొండలు, ట్రస్ట్ బోర్డు సభ్యులు పతివాడ వెంకటరావు, వెత్స శ్రీనివాసరావు, బలివాడ పార్వతి, గంధం లావణ్య, రామ్‌సింగ్ సూరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేలబావిలో పడి మహిళ మృతి

- మరో మహిళ పరిస్థితి విషమం



మృతి చెందిన ఈశ్వరమ్మ



చికిత్స పొందుతున్న లక్ష్మి

బొండపల్లి(మెంటాడ): మండలంలోని కుంటినవలస గ్రామంలో మామిడి మొక్కలకు నీరు పోసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నేలబావిలో కాలుజారి పడి ఒక మహిళ అక్కడిక్కడే మృతి చెందగా మరో మహిళ అదే బావిలో పడి ప్రాణాలతో బయటపడింది. మంగళవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఆంద్ర ఎస్సై సిద్దార్థ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన యాసరపు ఈశ్వరమ్మ(42)తో పాటు నక్క లక్ష్మి(40) మామిడి మొక్కలకు నీరు పోసేందుకుగాను పనికి వెళ్లారు. ఈ నేపథ్యంలో పొలంలో గల నేలబావి వద్ద బావికి అడ్డంగా వేసిన తాటి చెక్కపై నుంచి నీరు తోడుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి నేలబావిలో పడిపోయారు. బావిలో పడిపోయిన ఈశ్వరమ్మ బురదలో కూరుకుపోయి మృతి చెందగా, లక్ష్మి బావిలో ఉన్న మొక్కను పట్టుకుని వేలాడుతూ ప్రాణాలతో బయటపడింది. బావిలో పడిన లక్ష్మి కేకలు వేయడంతో మొక్కలు నాటుతున్న అదే గ్రామానికి చెందిన వారు అక్కడికి చేరుకుని మొక్కను పట్టుకుని వేలాడుతున్న ఆమెను రక్షించి గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం గజపతినగరం సీహెచ్‌సీ తరలించగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

ఆర్టీసీ ఢీకొని తాత్కాలిక ఉద్యోగి..

పార్వతీపురంటౌన్: పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఆర్టీసీ హైర్ బస్సు సోమవారం ఢీకొనడంతో తాత్కాలిక ఉద్యోగి పండిత రాము మృతిచెందాడు. దీంతో మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించేందుకు యత్నిస్తుండగా మృతుడి కుటుంబసభ్యులు చేసుకుని యాజమాన్యం నుంచి రావాల్సిన నష్టపరిహారాన్ని అందించాలని కాంప్లెక్స్ ఆవరణలో ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో డిపో మేనేజర్ కనకదుర్గ స్పందించి బస్సు యాజమాన్యంతో మాట్లాడి నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించి మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకువెళ్లారు.



బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న డిపో మేనేజర్ కనకదుర్గ

గుర్తు తెలియని వ్యక్తి..



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక గాజులరేగ బ్రిడ్జి వద్ద రైల్వేట్రాక్ పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు శ్రీకాకుళం జీఆర్‌పీ ఎస్సై చెల్లూరి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాక్ పక్కన మొక్కలను తొలగిస్తుండగా గుండె నొప్పి వచ్చి చనిపోయినట్లు నిర్ధారణకు వచ్చామని పేర్కొన్నారు. అయితే మృతుడి వివరాలు తెలియరాలేదన్నారు. తెలిసిన వారు ఎవరైనా ఫోన్ 7013273731 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.